


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం, మార్చి 6, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-

## కృష్ణమ్మను చేరిన గోదారి



రాజీవ్ లింక్‌కెనాల్ ద్వారా ఎన్ఎస్‌పీ కాల్వలోకి గోదావరి జలాలు

100 కి.మీ. ప్రయాణించి ఖమ్మం జిల్లాకు చేరిన నీరు

గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టు స్థిరీకరణ



## ఐఏఎస్‌లది ఆధిపత్య ధోరణి

ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లపై పెత్తనం చలాయించాలని చూస్తారు

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ ఆగ్రహం

## తొలి రోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం

పరీక్ష రాసిన విద్యార్థులు 5.14 లక్షలు.. 17 వేల మంది గైర్హాజరు విద్యార్థులకు ఉక్కపోత.. పలుచోట్ల తాగునీటి సమస్య



# బీజేపీకే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ

## కాంగ్రెస్ అభ్యర్థిపై గెలిచిన అంజిరెడ్డి



కరీంనగర్: కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. నువ్వా..నేనా అన్నట్టుగా మూడురోజులపాటు కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. ముక్కోణపు పోరులో చివరకు బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి అత్యధిక ఓట్లతో విజయం సాధించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి కౌంటింగ్ నిర్విరామంగా కొనసాగింది. ఉదయం 8.30 గంటలకల్లా.. మొదటి ప్రాధాన్యత ఓట్లకు సంబంధించిన 11 రౌండ్లు పూర్తయ్యాయి. మొత్తంవ్యాలి డ్ ఓట్లు 2,23,343 కాగా, అందులో 28,686 ఓట్లు చెల్లనివి ఉన్నాయి. అధికారులు 1,11,672 ఓట్లను గెలుపు కోటాగా నిర్ధారించారు.

**మొదటి ప్రాధాన్యతలో**

**7 రౌండ్లు బీజేపీ... 4 రౌండ్లు కాంగ్రెస్‌కు ఆధిక్యం**

మొదటి ప్రాధాన్యత ఓట్లకు సంబంధించి కౌంటింగ్ జరిగిన 11 రౌండ్‌లలో మొదటి నుంచీ బీజేపీ ఆధిక్యం కనబర్చగా, మధ్యలో 6,7,8,9 రౌండ్‌లలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఆధి క్యం వచ్చింది. చివరి రెండు రౌండ్‌లలో తిరిగి

(మిగతా 2వ పేజీలో)



## ఎంఎల్‌సి టికెట్లకు

# భారీగా దరఖాస్తులు

అభ్యర్థుల ఎంపిక విధివిధానాలపై కసరత్తు

సిఎం ఇంట్లో కాంగ్రెస్ కోర్‌కమిటీ భేటీ

మరోసారి సమావేశం కావాలని నిర్ణయం

శుక్రవారం ఢిల్లీకి సిఎం రేవంత్‌రెడ్డి

రెండు రోజుల పాటు అక్కడే మకాం 7,8

తేదీల్లో అభ్యర్థులజాబితాకు తుదిరూపం

హైదరాబాద్ : ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కోర్ కమిటీ భేటీ అ య్యిం ది. జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఏఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్, పి సిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు పాల్గొన్నారు. గంటకుపైగా కొనసాగిన ఈ సమావేశంలో ఎ మ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు అనుసరించాల్సిన విధి, విధానాలపై చ ర్చించినట్లుగా తెలుస్తోంది. ఈనెల 29వ తేదీన ఐదు ఎమ్మెల్సీ స్థా నాలు ఖాళీ ఏర్పడుతున్నాయి. వాటిని భర్తీ చేసేందుకు ఇప్పటికే ఎ న్నికల సంఘం నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఈ నెల 10వ తే దీ వరకు

(మిగతా 2వ పేజీలో)

# భూములు అమ్మితే కానీ సర్కారు నడవని పరిస్థితి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

రూ.30 వేల కోట్ల విలువైన 400 ఎకరాల

ప్రభుత్వ భూముల అమ్మకానికి సర్కారు పన్నాగం

నిధుల సమీకరణ పేరుతో చవకగా భూముల అమ్మకం



హైదరాబాద్: భూములు అమ్మితే కాని ప్రభుత్వాన్ని నడపలేని స్థితికి తెలంగాణ వచ్చిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. హైడ్రా, మూసీ వెంట ఇళ్ల కూల్చివేతలు.. వంటి తలాతోకలేని విధానాలతో రాష్ట్ర ఆదాయం తగ్గి ప్రభుత్వ భూములను అమ్ముకుంటే కాని ఆదాయం సమకూర్చుకోలేని స్థాయికి రేవంత్ సర్కార్ దిగజారిందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రూ.30 వేల కోట్ల నిధుల సమీకరణ కోసం తాజాగా హైదరాబాద్‌లోని విలువైన భూములను చవకగా అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా

(మిగతా 2వ పేజీలో)



## భారత్‌పైనా బాదుడే .. ఏప్రిల్ 2 నుంచి సుంకాలు

వైట్‌హౌజ్‌లో ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

చుట్టుముట్టిన ట్రేడ్ వార్ భయాలు

ప్రతిగా టారిఫ్‌లతోనే బదులిస్తున్న ఆయా దేశాలు

అంతర్జాతీయ వాణిజ్య సమరానికి
సర్వం సిద్ధం చేస్తున్నారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.



## అమెరికాలో కాల్పులు.. కేశంపేట యువకుడి మృతి

ఎంఎస్ సెకండియర్ చదువుతున్న ప్రవీణ్

# త్వరలో మన ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ

దేశంలో ఆర్థిక ప్రగతికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి

ప్రజలపై, నూతన ఆవిష్కరణలపై భారీగా పెట్టుబడులు పెట్టాలి

ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ భవిష్యత్తుకు బ్లూప్రింట్



న్యూఢిల్లీ: భారతదేశ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు (రూ.435.17 లక్షల కోట్లు) చేరుకోవడం ఇక ఎంతోదూరంలో లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. దేశంలో ఆర్థిక ప్రగతికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రజలపై, ఆర్థిక వ్యవస్థపై, నవీన ఆవిష్కరణలపై భారీగా పెట్టుబడులు పెట్టాలని

(మిగతా 2వ పేజీలో)

# అమెరికాలో కాల్పులు.. కేశంపేట యువకుడి మృతి

## ఎంఎస్ సెకండియర్ చదువుతున్న ప్రవీణ్



కేశంపేట: ఉన్నత ఆశయాలతో అమెరికా వెళ్లిన ఓ విద్యార్థి.. అక్కడ గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో మృతిచెందాడు. ఈ ఘటన తల్లిదండ్రులకు తీరని విషాదాన్ని మిగిల్చింది. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రానికి చెందిన వ్యాపారి గంప రాఘవులు, రమాదేవి దంపతులకు ప్రవీణ్‌కుమార్ (27), గాయత్రి సంతానం. గీతం యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన ప్రవీణ్.. అనంతరం 2023 ఆగస్టులో అమెరికాలోని మిల్వాకీ పట్టణంలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్‌లో ఎంఎస్ చదివేందుకు వెళ్లాడు. అదే పట్టణంలోని ఓ మాల్‌లో పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నాడు. గతేడాది డిసెంబర్ 18న ఇంటికి వచ్చిన ప్రవీణ్ జనవరి 20న తిరిగి అమెరికా వెళ్లాడు. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 2.50 నిమిషాలకు ప్రవీణ్ తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. అయితే కుటుంబ సభ్యులు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. తిరిగి ఉదయాన్నే వాట్సాప్ కాల్ చేయమని మెసేజ్ పెట్టినా ప్రవీణ్ నుంచి రిప్లయ్ రాలేదు. దీంతో ఉదయం 7 గంటలకు కుమారుడి ఫోన్‌కు కాల్ చేశారు. ఫోన్ లిఫ్ట్ చేసిన అవతలి వ్యక్తులు ప్రవీణ్ వివరాలను అడగటంతో సైబర్ నేరగాళ్లు అనుకుని ఫోన్ కట్ చేశారు. మరోసారి ప్రవీణ్‌తో కలిసి రూంలో ఉండే అతని మిత్రులకు ఫోన్ చేశారు. కొద్దిసేపటి తర్వాత వివరాలు తెలుసుకున్న వారు గుర్తుతెలియని వ్యక్తులు మాల్‌లో ప్రవీణ్‌ను గన్‌తో కాల్చారని, బుల్లెట్ గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడని చెప్పడంతో కుటుంబ సభ్యులు కుప్పకూలారు. ప్రవీణ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**అండగా ఉంటాం: డీకే అరుణ**

అమెరికాలో మృతిచెందిన ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం ప్రవీణ్ తల్లిదండ్రులను కలిసి పరామర్శించారు. అనంతరం ఎంపీతో ఫోన్‌లో మాట్లాడించారు. వివరాలను అందిస్తే మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తెచ్చేందుకు కృషి చేస్తామని ఆమె వారికి హామీ ఇచ్చారు.

# భారత్‌పైనా బాదుడే .. ఏప్రిల్ 2 నుంచి సుంకాలు

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నగా వ్యవహరించే అగ్రరాజ్యాధిపతే.. ప్రతీకార సుంకాలకు ముహూర్తం ఖరారు చేశారు మరి.**

**వచ్చే నెల నుంచి భారత్‌సహా చైనా, మరికొన్ని దేశాలపై అధిక టారిఫ్‌లుంటాయని వైట్‌హౌజ్‌లో ట్రంప్ ఇప్పుడు అధికారికంగా ప్రకటించారు.**

న్యూయార్క్/వాషింగ్టన్/న్యూఢిల్లీ, మార్చి 5: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టిన పట్టు వీడటం లేదు. తమ దేశ వస్తూత్పత్తులపై అధిక సుంకాలు వేస్తున్న దేశాలపై త్వరలో ప్రతీకార సుంకాలు తప్పవంటూ గతకొద్ది రోజులుగా హెచ్చరిస్తూ వస్తున్న ట్రంప్.. అన్నంత పనికి రెడీ అయ్యారు. ఏప్రిల్ 2 నుంచి భారత్, చైనా మరికొన్ని దేశాలపై అధిక సుంకాలుంటాయని అధికారికంగా ప్రకటించారు. రెండోసారి అగ్రరాజ్యానికి అధ్యక్షుడైన ట్రంప్.. వైట్‌హౌజ్‌లో తాజాగా తొలిసారి జరిపిన కాంగ్రెస్ జాయింట్ సెషన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా అమెరికా నుంచి దిగుమతి అవుతున్న గూడ్స్‌పై భారత్ అధిక సుంకాలు వసూలు చేస్తున్నదని విమర్శించారు. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆక్షేపించారు. అందుకే తామూ అదే స్థాయిలో ఆయా దేశాలపై పరస్పర సుంకాలకు దిగబోతున్నట్టు తేల్చిచెప్పారు. దీంతో ఒక్కసారిగా వాణిజ్య యుద్ధం భయాలు చుట్టుముట్టాయి.

**100 శాతానికిపైగా..**

'అమెరికా నుంచి భారత్‌లోకి దిగుమతి అవుతున్న ఆటోమొబైల్స్‌పై అక్కడ 100 శాతానికిపైగా టారిఫ్‌లు పడుతున్నాయి. ఇది అస్సలు సరికాదు. నిజానికి దశాబ్దాల కాలం నుంచి అమెరికా వస్తూత్పత్తులపై ఆయా దేశాలు అధిక సుంకాలు వేస్తున్నాయి. యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలు, చైనా, బ్రెజిల్, ఇండియా, మెక్సికో, కెనడాల గురించి మీరు వినే ఉంటారు. అమెరికా కంటే ఎక్కువగా టారిఫ్‌లు వేస్తున్న దేశాల సంఖ్య లెక్కే లేదు మరి. ఇప్పుడు వాటన్నిటిపై అమెరికా కూడా అధిక టారిఫ్‌లు వేసేందుకు సిద్ధమైంది' అని ట్రంప్ అన్నారు. గత నెల అమెరికా పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీతో కూడా ప్రతీకార సుంకాలు తప్పవని ట్రంప్ స్పష్టం చేసిన సంగతి విదితమే.

**ప్రతీకార సుంకాలు**

ట్రంప్ ప్రకటన నేపథ్యంలో ఆయా దేశాలూ ప్రతీకార సుంకాలకు సై అంటున్నాయి. ఆదివారం తమ నిర్ణయం వెల్లడిస్తామని మెక్సికో తెలిపింది. చైనా కూడా అమెరికా నుంచి తమ దేశంలోకి దిగుమతి అవుతున్న ప్రధాన వ్యవసాయోత్పత్తులపై 15 శాతం వరకు అదనపు సుంకాలు తప్పవని హెచ్చరించింది. కెనడా ఈ నెల 4 నుంచే ప్రతీకార సుంకాలకు దిగింది. 30 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా గూడ్స్‌పై 25 శాతం సుంకాలు వేసింది. అయితే కెనడా, మెక్సికోలపై 25 శాతం అదనపు టారిఫ్‌లను వేస్తున్న అమెరికా.. చైనాపై 10 శాతం అదనపు టారిఫ్‌లను వేసింది. మొత్తానికి ట్రంప్ సుంకాలు మొదలైతే వచ్చే నెలలో వాణిజ్య యుద్ధం తీవ్ర స్థాయికి చేరడం ఖాయమే.



**ట్రంప్ ఏమంటున్నారు?**

సుంకాలపై భారత్ చాలా కఠినం. భారతీయ మార్కెట్‌లో అమ్మాలంటే అమెరికా సంస్థలకు కష్టంగా మారుతున్నది. 30-60 శాతం.. కొన్నింటిపై 70 శాతం, ఆపైనే సుంకాలను విధిస్తున్నారు. అమెరికా ఆటోమొబైల్ కంపెనీలు తమ కార్లను భారత్‌లో అమ్మడం గగనమే.భారత్‌తో అమెరికా వాణిజ్య లోటు దాదాపు 100 బిలియన్ డాలర్లుగా ఉన్నది. దక్షిణ కొరియాకు మిలిటరీ సాయం చేశాం. ఎన్నో రకాలుగా అండగా ఉన్నాం. అయినా అమెరికాపై 4 రెట్లు అధికంగా సుంకాలు వేస్తున్నది ఆ దేశం. అలాగే సగటున చైనా రెండు రెట్లు ఎక్కువగా టారిఫ్‌లు వేస్తున్నది. అమెరికాపై ఎంత సుంకాలు వేస్తారో.. అంతే సుంకాలు ఆ దేశాలపై ఉంటాయి. కెనడా, మెక్సికోలకు సాయం చేసినా అపకారమే చేస్తున్నాయి. అందుకే ప్రతీకార సుంకాలకు దిగుతున్నాం.



# కృష్ణమ్మను చేరిన గోదారి

**రాజీవ్ లింక్‌కెనాల్ ద్వారా ఎన్ఎస్‌పీ కాల్వలోకి గోదావరి జలాలు**

**100 కి.మీ. ప్రయాణించి ఖమ్మం జిల్లాకు చేరిన నీరు**

**గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టు స్థిరీకరణ**

ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి ఒక కీలకఘట్టం సాకారమైంది. ప్రాజెక్టులోని మూడు పంపుహౌస్‌ల నుంచి 100 కి.మీ. మేర ప్రయాణించిన గోదావరి జలాలు బుధవారం రాత్రి ఏన్కూరు మండలం అక్కినాపురం తండా 52వ కి.మీ. వద్ద ఎన్ఎస్‌పీ (నాగార్జునసాగర్ ప్రాజెక్టు) కాల్వకు చేరాయి. ఈ సందర్భంగా జూలూరుపాడు మండలం వినోబానగర్ వద్ద రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించి.. పుష్పాభిషేకం చేశారు. సాగర్ ఆయకట్టు స్థిరీకరణ: సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని నాగార్జునసాగర్ ఆయకట్టుకు అందించేందుకు ప్రభుత్వం ఏన్కూరు లింక్ కెనాల్(రాజీవ్ కెనాల్) నిర్మాణం చేపట్టింది. 8.6 కి.మీ. పొడవైన ఈ కెనాల్‌కు రూ.97 కోట్లు కేటాయించారు. గత ఏడాది మే నెలలో ప్రారంభమైన పనులు పూర్తికావడంతో జూలూరుపాడు, ఏన్కూరు మండలాల్లో 7,500 ఎకరాలు, వైరా ప్రాజెక్టు కింద 17 వేల ఎకరాల ఆయకట్టుతో పాటు సత్తుపల్లి, మధిర నియోజకవర్గంలోని మిగతా ఆయకట్టుకు కూడా సీతారామ పనులు పూర్తికాగానే నీరు అందనుంది. సీతారామ ప్రాజెక్టులో భాగంగా 104 కి.మీ. మేర కాల్వల త వ్వకం పూర్తయ్యింది. జూలూరుపాడు మండలం వరకు ప్రాజె క్టు పూర్తికాగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొంతమేరకు పెండింగ్‌లో ఉంది. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద, కూసుమంచి మండలం పాలేరు వద్ద టన్నెల్ నిర్మాణాలు కొన సాగుతున్నాయి. మరికొన్ని చోట్ల భూసేకరణ సమస్యలతో జాప్యం జరుగుతోంది. పాలేరు వరకు ప్రధాన కాల్వ నిర్మాణం పూర్తి కావడానికి సమయం పట్టనుండగా ఏన్కూరు వద్ద ఎన్నెస్పీ కాల్వకు గోదావరి జలాలు చేర్చేలా రాజీవ్ లింక్ కెనా ల్ నిర్మాణం చేపట్టారు. దీంతో వైరా, సత్తుపల్లి, మధిర నియో జకవర్గాలకు తొలుత గోదావరి జలాలు అందుతున్నాయి. తొలిదశలో ఒక పంపుహౌస్‌లో ఒక మోటార్ నడిపించడం ద్వారా 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గంటకు మూడు కిలోమీటర్లు చొప్పున ప్రవహించిన నీరు జూలూరుపాడు మండలం వినోబానగర్ వద్ద రాజీవ్ లింక్ కెనాల్‌కు బుధవారం చేరింది. ఇక్కడ నుంచి పరవళ్లు తొక్కుతూ 8.6 కి.మీ. ప్రవహించి ఏన్కూరు మండలం అక్కినాపురం తండా వద్ద ఎన్నెస్పీ కాల్వలో బుధవారం రాత్రి కలిశాయి. ఆపై 12 కి.మీ. ప్రయాణించి 38వ కి.మీ. వద్ద యూటీ నుంచి వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు చేరుతాయి. మధిర, సత్తుపల్లి మండలాలకు కూడా నీరు చేరుతుంది.

# ఐఏఎస్‌లది ఆధిపత్య ధోరణి

న్యూఢిల్లీ: ఐఏఎస్ అధికారులు ఎప్పుడూ ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. అందుకే ఐఏఎస్‌ల మాట మేం ఎందుకు వినాలనే అసహనం, అసంతృప్తి ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల్లో గూడుకట్టుకుపోయిందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఒక కేసును జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. అటవీ అధికారులు తమ ఆదేశాలను పాటించాలని ఐఏఎస్ అధికారులు కోరడంపై ధర్మాసనం విస్తృతంగా చర్చించింది. ఇండియన్ అడ్మిన్‌స్ట్రేటివ్ సర్వీసెస్, ఇండియన్ పోలీస్ సర్వీసెస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ అధికారుల మధ్య జరుగుతున్న ఈరఖ్య యుద్ధాన్ని ప్రస్తావిస్తూ జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐఏఎస్‌లకు ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లకు మధ్య బేదాభిప్రాయాలు లేవని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనను జడ్జి తప్పుబట్టారు. "నేను ప్రభుత్వ న్యాయవాదిగా మూడేళ్లు పనిచేశా. న్యాయమూర్తిగా 22 ఏళ్లుగా సేవలందిస్తున్నా. ఇన్నేళ్లలో నేను గమనించింది ఏంటంటే ఐఏఎస్‌లు ఎప్పుడూ ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లపై ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని చూస్తుంటారు. ఈ వివాదం అన్ని రాష్ట్రాల్లో ఉంది. అందరూ ఒకే అఖిల భారత సర్వీస్‌లకు సంబంధించిన ఉన్నతాధికారులమే అయినప్పుడు ఐఏఎస్‌ల మాటే ఎందుకు వినాలి? అనే అసంతృప్తి ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లలో ఉంది. ఈ విధానం మారాలి. ఈ విషయంలో అందర్నీ సమానంగా చూడాలని భావన ఐఏఎస్‌లలో కల్పించండి" అని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు జస్టిస్ గవాయ్ సూచించారు. అధికారుల మధ్య ఉన్న అంతర్గత వివాదాలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని కేంద్రం తరఫున తుషార్ కోర్టుకు తెలిపారు. జడ్జీలు కేసు తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదావేశారు.

# ఎంఎల్‌సి టికెట్లకు భారీగా దరఖాస్తులు

నామినేషన్లు దాఖలు చేసుకోవడానికి గడువు విధించింది. ప్రధానంగా ఖాళీ ఏర్పడిన 5 ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బిఆర్ఎస్‌కు, మిగిలినవి కాంగ్రెస్ పార్టీకి దక్కనున్నాయి. ఈ నాలుగు స్థా నాలకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పిసిసి కోర్ కమిటీ ఈ కసరత్తు మొదలుపెట్టింది. అందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం నిర్వహించారు. మరోసారి సమావేశం కావాలని పిసిసి నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఎమ్మెల్సీ పదవుల కోసం పిసిసికి భారీ సంఖ్యలో దరఖాస్తులు అందినట్లుగా తెలుస్తోంది. ఈ సమావేశానికి ముందు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా ఏఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారు. సిఎం రేవంత్ రెండు రోజులు పాటు అక్కడే ఉండే అవకాశం ఉందని పిసిసి వర్గాలు చెబుతున్నాయి. అయితే ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఈ నెల 7, 8 తేదీల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎంపిక తుది రూపానికి వచ్చే అవకాశం ఉందని పిసిసి వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నెల 7,8 తేదీల్లో ముఖ్యమంత్రి ఢిల్లీలోనే ఉంటుండడంతో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మాజీ పిసిసిఅధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కోర్ కమిటీ మొత్తం ఢిల్లీలో అందుబాటులో ఉండడం వల్ల ఏఐసిసితో చర్చించి అభ్యర్థులు ఎంపికపై తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని పిసిసి వర్గాలు పేర్కొంటున్నాయి.




# ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ జయప్రదం చేయండి

**::: ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు**

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 05 : విద్యార్థుల దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం, భయాన్ని పోగొట్టడం కోసం చౌటుప్పల్ మండలం లోని జరుగు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు అన్నారు,స్థానిక చౌటుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో ఈనెల 9న ఆదివారం రోజున చౌటుప్పల్ మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ కరపత్రాలను విద్యార్థులతో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా లావుడియా రాజు మాట్లాడుతూ త్వరలో రాబోయే పదవ తరగతి పరీక్షలను ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా ధైర్యంగా రాసి ఫలితాలు సాధించాలని తల్లిదండ్రుల కళల్ని నిలబెట్టాలని అన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం,చదివే అన్నింటికీ మూలమని ఉన్నతంగా చదివి జీవితంలో మంచి స్థానంలో ఉండాలని అన్నారు. ఉన్న తక్కువ సమయాన్ని ఎక్కువగా ఉపయోగించుకోవాలని సమయాన్ని వృధా చేసుకోవద్దని పిలుపునిచ్చారు.మండల వ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరూ టాలెంట్ టెస్ట్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తీగ్గుల శ్రీనివాస్,మండల అధ్యక్షులు ప్రకాష్, మండల నాయకులు రవి,నందీశ్వర,అజయ్,శ్రీ వేదా,మౌనిక,నందిని,శివ,రఘుపతి,నందు తదితరులు పాల్గొన్నారు.

# తొలి రోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం

**పరీక్ష రాసిన విద్యార్థులు 5.14 లక్షలు.. 17 వేల మంది గైర్హాజరు**

**విద్యార్థులకు ఉక్కపోత.. పలుచోట్ల తాగునీటి సమస్య**

హైదరాబాద్: చిన్నచిన్న సమస్యలు ఎదురైనప్పటికీ ఇంటర్మీడియట్ తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఫస్టియర్ ద్వితీయ భాష పరీక్షకు 5,14,184 మంది హాజరుకావాల్సి ఉండగా, 4,96,899 మంది హాజరయ్యారు. మొత్తంగా 17,010 (3.41 శాతం) మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. హైదరాబాద్‌లో అత్యధికంగా 244 పరీక్ష కేంద్రాల్లో 87,523 మంది ఫస్టియర్ పరీక్ష రాశారు. వరంగల్, హన్మకొండలో రెండు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. పరీక్షల తీరును అధికారులు ప్రతిక్షణం పరిశీలించినట్టు ఇంటర్ పరీక్షల విభాగం ముఖ్య అధికారి జయప్రదాబాయ్ వెల్లడించారు. ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య హైదరాబాద్ నారాయణగూడలోని రత్నా, జాహ్నవి, శ్రీచైతన్య కాలేజీలకు వెళ్లి పరీక్షల తీరును పరిశీలించారు. ఇతర అధికారులు కూడా నగరంలోని పలు కాలేజీలను పరిశీలించారు. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలోని 33 స్క్రీన్లను ప్రత్యేక సిబ్బంది పరీక్షలు పూర్తయ్యే వరకూ గమనించారు. పరీక్షకు సకాలంలో రావాలని ఇంటర్ బోర్డ్ పదేపదే సూచించినా కొన్నిచోట్ల విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో 162 మంది 9 గంటల తర్వాత పరీక్షకు హాజరయ్యారు. అయితే ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్‌తో వారిని పరీక్షకు అనుమతించారు. ఖమ్మంలోని కొన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల లింక్ ఆలస్యమవడంతో ప్రశ్నపత్రాల బండిల్ తెరవడం ఆలస్యమైంది. దీంతో విద్యార్థులు పావుగంట నష్టపోవాల్సి వచ్చింది. చాలాచోట్ల కమాండ్ కంట్రోల్ రూంనుంచి సకాలంలో సీసీ కెమెరాలు లింక్ అవ్వలేదన్న ఫిర్యాదులు అధికారులకు వచ్చాయి. మారుమూల ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. వరంగల్, ములుగు, భద్రాచలం, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఫ్యాన్లు సరిగా పనిచేయకపోవడంతో ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని విద్యార్థులు తెలిపారు. తాగునీటి కోసం ఏర్పాట్లు చేసినా, ఆఖరి అరగంటలో 26 పరీక్ష కేంద్రాల్లో తాగునీరు అందక విద్యార్థులు సమస్యలు ఎదుర్కొన్నారు.

# భూములు అమ్మితే కానీ సర్కారు నడవని పరిస్థితి

శేరిలింగపల్లి మండలం కంచ గచ్చిబౌలి పరిధిలో ఉన్న 400 ఎకరాల భూములను అమ్మడం లేదని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మాట మార్చారన్నారు. అసెంబ్లీని మోసం చేసిన రేవంత్, ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పులు చేసినప్పటికీ, ఎన్నో సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతులు, పేదలను ఆదుకున్నామన్నారు. 70 లక్షల మంది రైతులకు రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు, రూ.28 వేల కోట్ల రుణమాఫీ, రూ.6 వేల కోట్లతో రైతు బీమా, లక్ష 11 వేల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారాన్ని తమ ప్రభుత్వం అందించిందన్నారు. అలాగే, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామసాగర్ వంటి సాగునీటి ప్రాజెక్టులు, 45 వేల చెరువుల పునరుద్ధరణ, 45 లక్షల మందికి ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్, కల్యాణ లక్ష్మి పథకాల అమలు, వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు, 30 మెడికల్ కాలేజీలను ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేవలం 15 నెలల పాలనలోనే రూ. 1.65 లక్షల కోట్ల పైచిలుకు అప్పు చేశారని ఆరోపించారు. అవగాహన రాహిత్యంతో శ్రీశైలం సొరంగాన్ని కుప్పకూల్చి 8 మంది ప్రాణాలు బలితీసుకున్న బాధ్యతలేని ప్రభుత్వం రేవంత్‌ది అన్నారు.

## త్వరలో మన ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు

భాగస్వామ్యపక్షాలకు పిలుపునిచ్చారు. ఆర్థిక వృద్ధికి, ఉద్యోగాల సృష్టికి పెట్టుబడులు అత్యంత కీలకమని వివరించారు. 'బడ్జెట్ అనంతరం ఉద్యోగాలు, ఉపాధి కల్పన'పై బుధవారం జరిగిన వెబినార్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు. 2014 నుంచి తమ ప్రభుత్వం 3 కోట్ల మంది యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చిందని అన్నారు. దేశవ్యాప్తంగా 1,000 ఐటీఐలను అప్‌గ్రేడ్ చేయాలని, ఐదు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లు నెలకొల్పాలని నిర్ణయించినట్లు తెలిపారు. 2015 నుంచి 2025 దాకా ఇండియా ఆర్థిక వ్యవస్థ 66 శాతం వృద్ధి చెందినట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఐఎంఎఫ్ నివేదిక వెల్లడించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ 3.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని హర్షం వ్యక్తంచేశారు. వెబినార్‌లో ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే... "ప్రపంచంలోని అత్యున్నత ఆర్థిక వ్యవస్థలను మనం అధిగమించాం. ఇండియా త్వరలో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడం తథ్యం. ఆర్థిక వ్యవస్థ పరుగులు పెట్టాలంటే సరైన దిశలో సరైన పెట్టుబడులు పెట్టడం అత్యంత కీలకం. ఇందుకోసం కేంద్ర బడ్జెట్‌లో పలు ప్రతిపాదనలు చేశాం. వాటిని అమలు చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. భాగస్వామ్యపక్షాలన్నీ ఇందులో పాలుపంచుకోవాలి.

# అధికారుల అండదండలతోనే అక్రమ నిర్మాణాల జోరు

**ఆగని అక్రమ నిర్మాణాలు**

**- చోద్యం చూస్తున్న అధికారులు**

**- రెచ్చిపోతున్న అక్రమ నిర్మాణాదారులు**



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : ఒక వైపు అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేధి లేదు అంటూనే అధికారులు అక్రమ నిర్మాణాదారులకు కొమ్ము కాస్తున్నారు శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, శ్రీరాం నగర్ ఏ, బి, సి. బ్లాకుల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. అడిగే నాథుడే లేడన్నట్లు రెచ్చిపోతున్నారు. అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితి లో ఉపేక్షించమని చెప్పే జోనల్ కమిషనర్ మాటలను అక్రమార్కులు పెడచెవిన పెట్టినా అధికారులు చూడకపోవడం లో అంతర్యం ఏమిటో వారికే తెలియాలి. సాక్షాత్తు జోనల్ కమిషనర్ చెప్పినా వినట్లేదు అంటే అక్రమార్కులు ఎంతకు తెగించారో, లేక పైకి మాత్రమే గంబీ ప్రకటనలు ఇచ్చే కమిషనర్ లోపల ములాకత్ అయ్యారా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. పరిస్థితి కూడా అందుకు అనుకూలంగానే కన్పిస్తుంది. అందుకే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. మామూళ్లు ఇచ్చుకో -...... అంతస్తులు వేసుకో.......సంబందించిత టౌన్ ప్లానింగ్ అధికారులకు మామూళ్లు ఇచ్చుకొని అంతస్థులకు అంతస్థులు నిర్మిస్తున్నారు. నిబంధనలు, గిబందనలు జాంతానై అన్నట్లు వ్యవహారిస్తూ మూడు పర్మిషన్లు ఆరు అంతస్థులు అన్నట్లు నడుస్తుంది వ్యవహారం. అధికారులు బదిలీపై వచ్చిన కొత్తలో కొంచెం కఠినంగా వ్యవహరించి కొన్ని అక్రమ నిర్మాణాలు గుర్తించి సీజ్ చేశారు. తర్వాత వీరికి రావాల్సిన ముడుపులు వచ్చాయో ఏమో గాని అటువైపు కన్నెత్త చూడడం మానేశారు. ఒకవైపు వ్యాపారం, ఇతర ఆర్థిక లేవాదేవిలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే



ఈ అక్రమార్కులు మాత్రం డబ్బు మధం తో అక్రమంగా అంతస్థులు వేస్తూనే ఉన్నారు. వీటిని నిరోధించాల్సిన అధికారులు ఇచ్చింది పుచ్చుకొని కళ్ళు మూసుకొని కూర్చుంటున్నారు. అధికారులు అందిన కాడికి దండుకొని గోతి కాడ నక్కల్లా మిన్నకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. శ్రీరామ్ నగర్ సి బ్లాక్ లో ప్లాట్ నెంబర్ 432 లో ఓ అక్రమ దారుడు యదేచ్ఛగా నిర్మాణం కొనసాగిస్తున్నాడని ప్రజావాణి లో పిర్యాదులు కూడా చేశారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# బిజెపిని ఎండగట్టడంలో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు విఫలం

**పొలిటికల్ ఫైట్ అవసరం**

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని మిర్యాలగూడ, మార్చి 25:- (వార్త మిర్రర్)

రాష్ట్రానికి ప్రమాదకరంగా మారబోతున్న బిజెపి విధానాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు విఫలం చెందాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. బుధవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ సిపిఎం కార్యాలయంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో మాయ మాటలతో, మతోన్మాదంతో ప్రజలను రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలుపొందాలని బిజెపికి చూస్తుందని అందులో భాగంగా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నిదర్శనం అన్నారు. బిజెపికి తామే ప్రధాన శత్రువు అని, తమ పార్టీ మాత్రమే అడ్డుకుంటుందని చెప్పుకుంటున్న కాంగ్రెస్ రాష్ట్రంలో బిజెపి అడ్డుకోలేకపోతుందని విమర్శించారు. కేవలం బిఆర్ఎస్ పార్టీని విమర్శించడమే తప్ప బిజెపి విధానాలను ఎండగట్టడం లేదని ధ్వజమెత్తారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ కూడా అదేవిధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు బిజెపికి బిఆర్ఎస్ సహకరిస్తుందని కాంగ్రెస్ చెప్పడం, కాంగ్రెస్ బిజెపిలు రెండు ఒకటేనని బిఆర్ఎస్ చెప్పడతో ఒకరికొకరు విమర్శ చేసుకుంటున్నారే తప్పా బిజెపిని సైద్ధాంతిక, రాజకీయపరంగా విమర్శించడం లేదని ఎద్దేవ చేశారు. ఇదే విధంగా కొనసాగితే తెలంగాణకు బిజెపి ప్రమాదం పొంచి ఉంటుందని ప్రధాన రాజకీయ పార్టీలు బిజెపిని అడ్డుకునేందుకుల్ ప్రయత్నించాలని సూచించారు. భవిష్యత్తులో బిజెపి పై పొలిటికల్ ఫైట్ జరగాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి ప్రమాదంపై తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. రాజస్థాన్ లో ఓ చిన్న కేసు విషయంలో పోలీసులు అర్ధరాత్రి ఇంట్లో చొరబడి ఆరు నెలల చిన్నారి చావుకు కారణం అయ్యారని, ముస్లిం వ్యతిరేకంగా పాలన చేయడమే ఆ పార్టీ లక్ష్యమన్నారు. మోడీ ప్రభుత్వం ఫాసిస్టు లక్షణాలు కలిగి ఉందని చెప్పారు. రేవంత్రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. కేవలం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ పైనే ఏదో గొప్పలు చేసినట్టు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. 50శాతం రిజర్వేషన్ దాటవద్దని సుప్రీంకోర్టు



చెప్తున్నా ఆ విషయం దృష్టిలో ఉంచుకొని పార్లమెంట్లో బీసీ కులగణన ఆమోదం పొందదనే దృష్టితోనే బీసీ కులగణన చేసినట్లు చెప్పుకుంటున్నారన్నారు. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వ నాటకమని విమర్శించారు.ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాద ఘటన దురదృష్టకరమన్నారు.ప్రభుత్వ వైఫల్యమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నామన్నారు. సొరంగ మార్గం తవ్వేటప్పుడు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని విమర్శించారు.చేతులు కాలాకా ఆకులు పట్టుకున్న చందంగా ప్రభుత్వ తీరు ఉన్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సొరంగ పనులు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారుప్రస్తుత అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో కూడా ఒరగబెట్టిందేమి లేదన్నారు.ప్రధాన పార్టీలు పరస్పర విమర్శలు మాని ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం ఖమ్మం, నల్గొండ జిల్లా కార్యదర్శులు నూనె నాగేశ్వరరావు, తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, డి.మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాషం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్, ఎండి సలీం, నాయకులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, భవాండ్ల పాండు, కోడిరెక్క మల్లయ్య, అరుణ, పల్లా బిక్షం పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరుబాట

**24 నుంచి 26 వరకు రిలే నిరాహారదీక్షలు...27న జిల్లా కేంద్రంలో మహాధర్నా**

**సిపిఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి**

మిర్యాలగూడ , మార్చి 5:- (వార్త మిర్రర్) ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల మొత్తం పోరుబాట నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రజల కోసం పనిచేసే సిపిఎం ప్రజా సమస్యలపై పోరుబాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10వరకు అన్ని గ్రామాలలో, పట్టణంలోని వార్డులలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు అధ్యయనం చేపట్టాలని కోరారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అందే విధంగా సంతకాల సేకరణ చేపట్టాలని, ప్రజా సమస్యలను గుర్తించి వాటిని రాసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలలో ప్రజా సమస్యలను గుర్తించేందుకు ర్యాలీలు, సభలు నిర్వహించాలని కోరారు. ఈ నెల 10 నుంచి 15వరకు అన్ని గ్రామాలలో పట్టణంలోని వార్డులలో బస్తీ ఆందోళన చేపట్టాలని కోరారు. నియోజవర్గ కేంద్రాలలో ఈనెల 24, 25, 26న రిలే నిరాహార దీక్షలు చేయాలన్నారు. మార్చి 27న జిల్లా కేంద్రంలో మహా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. సంక్షేమ



పథకాలు అమలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి ప్రజా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా కమ్యూనిస్టుగా ఉన్న భగత్ సింగ్ ను మతోన్మాద పార్టీలు తమ నాయకుడిగా చెప్పుకొని చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. ఈ నెల 23 న వాడవాడనా గ్రామ గ్రామాన భగత్ సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్ చరిత్రలో యువకులకు వివరించి చైతన్యపరచాలన్నారు. హామీలు అమలయ్యేంతవరకు ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. దీని కోసం కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.మల్లేష్, ఒన్, టూ టౌన్ కార్యదర్శులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, భవాండ్ల పాండు, జిల్లా కమిటీ సభ్యులు ఆయూబ్, నాయకులు అరుణ, కోడిరెక్క మల్లయ్య, పల్లా బిక్షం, కరిమున్నిసా బేగం, చుండూరు శ్రీను, వెంకన్న, రామారావు పాల్గొన్నారు.



**తనుశ్రీ గ్రూప్ అధినేత**

**జక్కుల రామ్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన**

**నేచర్ నివాస్ డెవలపర్స్ అధినేత సికీలమెట్ల శ్రీహరి**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

ఎల్బీనగర్ నేచర్ నివాస్ డెవలపర్స్ ఆఫీసులో తనుశ్రీ గ్రూప్ ప్రాపర్టీస్, డెవలపర్స్ అధినేత జక్కుల రామ్ యాదవ్ జన్మదిన సందర్భంగా నేచర్ నివాస్ డెవలపర్స్ సి. ఎండి సికీలమెట్ల శ్రీహరిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు, జక్కుల రామ్ యాదవ్ కు శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో తనుశ్రీ గ్రూప్ మంచి పేరు సంపాదించాలని, వ్యాపారంలో రాణించాలని అన్నారు




**సందుపట్ల మల్లయ్య సాగర్ దశదిన కార్యక్రమంలో**

**పాల్గొన్న ప్రముఖ జర్నలిస్టులు-ఆస్కానీ మారుతి**

**సాగర్, గొల్లూరి గణేష్ సాగర్, ఆంజనేయులు సాగర్**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) చింతపల్లి మండలం మాల్ వీ.టి నగర్ బి.జే గార్డెన్ లో సందుపట్ల రాజేష్ సాగర్, రాము సాగర్, లక్ష్మణ్ సాగర్ల తండ్రి మల్లయ్య సాగర్ దశదిన కార్యక్రమంలో పాల్గొని మల్లయ్య సాగర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన (టి యు డబ్ల్యూ జే) 143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ ఆస్కానీ మారుతి సాగర్, వార్త మిర్రర్ యాదాద్రి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గోల్లూరి గణేష్ సాగర్,(టి యు డబ్ల్యూ జే) 143 జిల్లా ఉపాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు కంచర్ల ఆంజనేయులు సాగర్, తెలంగాణ రాష్ట్ర సగర మహిళ సంఘం గౌరవ అధ్యక్షురాలు అమృతసాగర్, కేసరి తదితరులు పాల్గొన్నారు,



**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి రావాలని**

**శ్రీశ్రీశ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు**

సంస్థాన్ నారాయణపూర్,మార్చి 05(వార్త మిర్రర్ నెట్వర్క్ ఇంచార్జ్ ఉప్పల వెంకటేష్ ):మునుగోడు అభివృద్ధి ప్రదాత, పేదల పెన్నిటి,మునుగోడు ముద్దుబిడ్డ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి రావాలని వలిగొండ మండలం వేములకొండ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దంగుల నరసింహ, ఉప్పల లింగస్వామి, దేప రాజు ముదిరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.





**కల్వకుర్తి గురుకుల (బాలురు)పాఠశాల ను**

**సందర్శించిన బీసీ సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి మణికంఠ**

కల్వకుర్తి మార్చ్ 5 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలం లోని బిసి గురుకుల (బాలురు) పాఠశాలను రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి మణికంఠ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులు, వసతి గృహాలు, వంటగదిన్నీ పరిశీలించారు. విద్యార్థులకు విద్య, వసతి సౌకర్యాలు వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి భవిష్యత్తు తరగతి గదిలో నిర్మితమవుతుందని నేటి బాలలే రేపటి పౌరులు అని ఆయన అన్నారు.విద్యార్థులకు సరైన వసతులు, తరగతి గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని,ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా విద్యార్థులకు సరిపడా కూర్చోవడానికి బెంచీలు,స్టడీ హాల్, పడుకోవడానికి బెడ్స్ లేక హాల్ లో పడుకుంటున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన విద్యార్థుల తలరాతలు మారడం లేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ చైర్మన్ జగన్, ఓయూ జేఏసీ నాయకులు రాజు నేత, కల్వకుర్తి నాయకులు నాగేష్, గాజుల రాము తదితరులు పాల్గొన్నారు.



**మృతి చెందిన కమలమ్మ**

**కుటుంబానికి 5000/వేల ఆర్థిక సహాయాన్ని అందించిన**

**బిఆర్ఎస్ జిల్లా నాయకులు సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

భువనగిరి మండలం హన్మపురం గ్రామ వాస్తవ్యులు కొన్నే కమలమ్మ గారి అకాల మరణం తెలుసుకున్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త, డా, ర్యాకల శ్రీనివాస్ వారి కుటుంబ సబ్యులకు 5000/వేల రూపాయల ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ ఆర్థిక సహాయన్నీ మాజీ వార్డు సభ్యులు నాగపూరి కృష్ణా వారి కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు



**ఇంటర్ పరీక్ష కేంద్రాలను**

**పరిశీలించి, అభ్యర్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలి**

**సబ్ కలెక్టర్ ఎంనారాయణ్ అమిత్**

మిర్యాలగూడ మార్చి 5:- (వార్త మిర్రర్) ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాగా బుధవారం మిర్యాలగూడ పట్టణం హనుమాన్ పేటలోని సినప్సి జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని తరగతి గదులను తిరిగి చూశా రు. పరీక్షలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, అభ్యర్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులను కోరారు. ఆయన వెంట తహసీల్దార్ ఎన్.హరిబాబు? ఒన్ టూ టౌన్ ఇన్స్పెక్టర్ పి.నాగార్జున, కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్ అన్నారు.



## జీఎచ్ఎంసీ ఉద్యోగి మృతి పలువురు అధికారుల సంతాపం.

చందానగర్ వార్త మిర్రర్ : శేర్లింగంపల్లి నియోజకవర్గం లోని చందానగర్ 21 సర్కిల్ కార్యాలయంలో యుసిడి విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్న తీగల శ్రీహరి ఆకస్మిక మృతి చెందాడు. ఆయన మృతి పట్ల సర్కిల్ ఉప కమిషనర్ మోహన్ రెడ్డి యుసిడిపిఓ ఉషారాణి ఆయా విభాగాల అధికారులు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు సర్కిల్ కార్యాలయ ఆవరణలో శ్రీహరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



## పుల్లెంల గ్రామంలో వడ్డగోని రవికుమార్ సొంత నిధులతో వాటర్ ప్లాంట్ శంకుస్థాపన

### వడ్డగోని రవికుమార్ అభినందిస్తున్న గ్రామ ప్రజలు

నల్గొండ వార్త మిర్రర్ ప్రతినిధి చండూర్ మండలం పుల్లెంల గ్రామంలో త్రాగునీటి సమస్యను తీర్చడానికి ముందుకు వచ్చిన వడ్డగోని రవికుమార్ తన సొంత నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవనం దగ్గర వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు, గ్రామ ప్రజలకు వాటర్ సమస్యను తీరుస్తున్న వడ్డగోని రవికుమార్ ను గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు, వాటర్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న దాత కుమారుడు హేమ్ చందర్,గోపిడి శేఖర్ రెడ్డి,గోపిడి వెంకట్ రెడ్డి,మందడి శంకర్ రెడ్డి,సీత యాదయ్య, వడ్డగోని చంద్రశేఖర్ గౌడ్,గంట రాములు సాగర్,ఇరిగి వెంకన్న,పాలకూరి బిక్షమయ్య, నీలకంఠం సత్తయ్య, నీలకంఠం నరేష్,బొడ్డు వెంకన్న,పాలకూరి వెంకలు,జక్కలి రణదీప్,గడ్డం అయోధ్య,మొగుదాల నర్సింహా,కోల్లోజు మదానచారి నడికూడ శివ తదితరులు పాల్గొన్నారు.



## డివిజన్ లో నూతనంగా ఏర్పడుతున్న కాలనీల రోడ్ల నిర్మాణం కోసం అదనంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి

### - జిహెచ్ఎంసి మేయర్ ను కలిసి వినతి పత్రం అందజేసిన హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్

ఎల్బీనగర్, 5 మార్చి :డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పడుతున్న కాలనీలో రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మిని కోరినట్లు స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. బుధవారం జిహెచ్ఎంసి కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మిని కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తో కలిసి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి నూతనంగా రోడ్ల నిర్మాణానికి ఇతర పనులకు నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. హస్తినాపూర్ డివిజన్ అభివృద్ధి తన లక్ష్యమని కార్పొరేటర్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు అన్నిటిని ఒక్కొక్కటిగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రతి సమస్యను తాను తెలుసుకొని అన్నిటికి జిహెచ్ఎంసి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి సానుకూలంగా స్పందించి డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని తెలిపినట్లు తెలిపారు.



## నేతాజీ హై స్కూల్లో స్వపరిపాలన దినోత్సవం

మిర్యాలగూడ, మార్చి 5:-( వార్త మిర్రర్)

మిర్యాలగూడ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని నేతాజీ మెమోరియల్ హై స్కూల్ లో బుధవారం స్వపరిపాలన దినోత్సవంఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినీ విద్యార్థులు అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులుగా విధులను నిర్వహించారు. విద్యాశాఖామంత్రిగా సాయి యతిష్, ఆర్జేడిగా బిందు, ఎంపీగా దత్తు, ఎంఎల్ఏ గా లాస్య, కలెక్టర్ గా నాగులమీర, డిప్యూటీ కలెక్టర్ గా ప్రవలిక, డిఇఓగా మల్లీశ్వరి, మండల విద్యాధికారిగా కార్తీక్, ఆర్డీఓగా ఇందు, ఎంపీడీఓగా సాయికుమార్.టీచర్స్ గా సాత్విక్, రంజిత్,అనితా, నివేద,అంజి, రిషిక,విక్రమ్, సాయికుమార్, దత్తు, సాత్విక, వర్షిత, కళ్యాణీ, లల్లి, మానస, నేహా, మణికంఠ, మహదేవ్, చైతన్య, లోహిత్, రాణి, మహిత, భవ్యశ్రీ, శ్రీ రామ్. చక్కగా వారి విధులు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి బహుమతి ప్రధానం ఎంఇఓ బాలునాయక్ అందిస్తారని పాఠశాల కరస్పాండెంట్ శ్రీపతి శ్రీనివాస్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు భీమ్లానాయక్, టీచర్లు నూరి, అలివేలు, సునీత, కళ్యాణీ, జబీన్, వసంత, సామ్యూల్, శోభ,సత్యం, సైదమ పాల్గొన్నారు.

# కడ్తాల్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పాడి రైతుల చలో ప్రజా భవన్

- పాడి పశువులతో ప్రజా భవన్ కు బయలుదేరిన ప్రజాప్రతినిధులను
- పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే అసెంబ్లీ ముట్టడి
- కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్






కల్వకుర్తి కడ్తాల్ మార్చ్ 5 వార్త మిర్రర్ ప్రతినిధి:- కడ్తాల్ మండలంలో పాడి రైతులు రోడ్డు ఎక్కారు. కడ్తాల్ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పాడి రైతులకు పెండింగ్ లో ఉన్న పాల బిల్లులను చెల్లించాలని చలో ప్రజాభవన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి పాడి పశువులతో మహా పాదయాత్ర చేసుకుంటూ ప్రజా భవన్ కు బయలుదేరారు. పాదయాత్ర చేసుకుంటూ ప్రజాభవన్ కి బయలుదేరిన నాయకులతో పాటు పలు ప్రజాప్రతినిధులను కడ్తాల్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ పాడి రైతుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. నెలలు గడుస్తున్న పాడి రైతుల పెండింగ్ బిల్లులు చెల్లించక రేవంత్ సర్కార్ కాలయాపన చేస్తుందని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టుల పర్వాన్ని కొనసాగి స్తుందని మండిపడ్డారు. పరితగతన పెండింగ్లో ఉన్న పాల బిల్లును చెల్లించకపోతే అసెంబ్లీతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ నరసింహారెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ మాజీ ఎంపీటీసీలు గోపాల్ ప్రియ రమేష్ రంగయ్య రైతు కోఆర్డినేటర్ వీరయ్య రైతు సమితి జిల్లా సభ్యులు శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచులు హరిచంద్ నాయక్ తులసి రామ్ కృష్ణయ్య పాడి రైతులు రాములు యాదవ్ రాజు పకీర నాయకులు నరసింహ రామచంద్రయ్య రమేష్ పాండు సిహెచ్ మహేష్ మల్లేష్ పవన్ హెచ్ ఆర్ మహేష్ అంజి శ్రీశైలం బాబా హం జద్ రమేష్ సరియా రవి శ్రీను కుమార్ శ్రీకాంత్ చందర్ మల్లేష్ రవి రమేష్ నాగార్జున సాయికుమార్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడిట్ రిపోర్టులు పరిశీలించాకే ఫీజులు ఖరారు చేయాలి

### ఎస్.ఎఫ్.ఐ తెలంగాణ టెక్నికల్ రాష్ట్ర కో కన్వీనర్ రామావత్ లక్ష్మణ్ నాయక్



కొండ మల్లేపల్లి మార్చి 05 వార్త మిర్రర్ :తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఫీజులను పెంచకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ కోరుతుంది అని ఇప్పటికే ప్రతిసంవత్సరం అక్రమంగా బి కేటగిరీ సీట్లను 15 లక్షల నుండి 25 లక్షలకు అమ్ముకుంటున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు, మరో కొత్త ఎత్తుతో మరింత దోపిడీ చేయాలని కుట్రలు అనిసూమారు 2000కోట్లు ఫీజులు వసూళ్లు కోసం ప్రణాళికలు, రాష్ట్ర ప్రభుత్వం ,తెలంగాణ ఫీజు నిర్ణయ కమిటీ వసతులు, లెక్చరర్స్, నిబంధనలు ప్రకారం ఫీజులు నిర్ణయించాలి.బి కేటగిరీ సీట్లను ఆన్ లైన్ ద్వారా నింపాలి, అక్రమ ఫీజులను నియంత్రణ చేయాలి.ప్రైవేటు ఇంజినీరింగ్, బీఎస్సీ అగ్రికల్చర్, ఫార్మసీ తదితర కాలేజీల్లో ఆడిట్ రిపోర్టులు పరిశీలించాకే ఫీజుల పెంపుపై తెలంగాణ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీ ఎఫ్ ఆర్సీ) నిర్ణయం తీసుకోవాలని ఎస్.ఎఫ్.ఐ తెలంగాణ టెక్నికల్ రాష్ట్ర కో కన్వీనర్ రామావత్ లక్ష్మణ్ నాయక్ కోరారు.ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలు గతంలో లక్షల రూపాయలు ఫీజులు పెంచుకొని, కాలేజీల్లో కనీస సదుపాయాలు కూడా కల్పించలేదని బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఎస్.ఎఫ్.ఐ పట్టణ కమిటీ సమావేశంలో ఎస్.ఎఫ్.ఐ తెలంగాణ టెక్నికల్ రాష్ట్ర కో కన్వీనర్ రామావత్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ నకిలీ ఆడిట్ రిపోర్ట్స్ సమర్పించి, కొత్త కోర్సులు, జీతాల పెంపు, మౌలిక వసతుల కల్పన తప్పుడు. ఆడిట్ లు సమర్పిస్తున్నారన్నారు. ఆయా ఖర్చుల వివరాలు పరిశీలించాకే ఫీజులు పెంచేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. గతంలో కూడా హడావుడిగా విచారణ చేసి, భారీగా ఫీజులు పెంచి, మళ్లీ తగ్గించడంతో కొన్ని కాలేజీల్లో స్టూ డెంట్లు యాజమాన్యాలు వేధించాయన్నారు. బీ కేటగిరీ ప్రవేశాలు కూడా ఆన్లైన్ ద్వారా భర్తీ చేసి, అక్రమ పద్ధతుల్లో డోనేషన్లు తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని, ఫీజులను ఏకపక్షంగా పెంచితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ పట్టణ కమిటీ నాయకులు ఆడెపు పెద్ద సైదులు, అసం సతీష్ రెడ్డి, చరణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

# డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు 25% రాయితీ

### మున్సిపల్ కమిషనర్ ఎండి యూసుఫ్






మిర్యాలగూడ మార్చి 5:-( వార్త మిర్రర్ మిర్యాలగూడ పట్టణంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు కాక ఎలాంటి అభ్యంతరాలు లేని ప్లాట్లను ఎల్ఆర్ఎస్ చేయించు కుంటే 25 శాతం రాయితీ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ బుధవారం విలేఖరులకు తెలిపారు. మిర్యాలగూడ మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం 14,000 దరఖాస్తులు వాటిని పరిశీలించిన అనంతరం వాటిలో నిషేధిత ప్రాంతం(ప్రోహిబిటెడ్ ఏరియా), గ్రీన్ జోన్లో లేని 1, 861దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ కు అర్హత ఉన్నవి ఉన్నాయని ఆయన అన్నారు. వాటితో పాటు నిషేధిత ప్రాంతంలో లేకుండా, గ్రీన్ జోన్లో లేకుండా ఉన్న వాటికి 25 శాతం రాయితీ ఇస్తూ ఆమోదం ఇస్తామని ఆయన తెలిపారు. డాక్యుమెంట్స్ అన్ని సక్రమంగా ఉంటే వెంటనే ఎల్ఆర్ఎస్ ను క్లియర్ చేస్తామని ఆయన తెలిపారు. 25 శాతం రాయితి సద్వినియోగం చేసుకోవాలని కోరుతు ఆటోలలో ప్రచారం చేస్తున్నామని, ప్రధాన కుడలుల వద్ద ప్లెక్సీలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రతి మంగళవారం, గురువారం, ఆదివారం పన్నుల సమస్యలు పరిష్కరించేందుకు ఆయా రోజుల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు రెవిన్యూ మేళా నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## జాతీయ సదస్సులో ప్రసంగించనున్న పంబాల పర్వతాలు

దేవరకొండ మార్చి 05 వార్త మిర్రర్ :

భారత సాంస్కృతిక మంత్రిత్వశాఖ వారు ఈ నెల 12, 13, 14, తేదీలలో ఆంధ్రపదేశ్ రాష్ట్రం కుప్పం ద్రవిడియన్ విశ్వవిద్యాలయంలో "దక్షిణ భారతదేశంలోని జానపద మరియు గిరిజన సంఘాల సాంప్రదాయ వ్రాతప్రతులు" అనే అంశంపై నిర్వహించబోయే జాతీయ సదస్సులో హైద్రాబాద్ విశ్వవిద్యాలయం నుంచి పంబాల పర్వతాలు ఈ సదస్సులో పాల్గొని "గిరిజన తాళపత్ర గ్రంథాలను సంరక్షించడం - సాంస్కృతిక, చారిత్రక మనుగడ, ఆవశ్యకత" అనే అంశంపై ఆయన ప్రసంగిస్తారు. దక్షిణ భారతంలో జాతీయ భాషను తప్పని సరి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తున్న ప్రస్తుత తరుణంలో జరుగుతున్న ఈ సదస్సులో పర్వతాలు ప్రసంగించబోయే ఈ అంశం దక్షిణ భారత జానపద తెగల నుండి నేటి తరానికి అందుతున్న చరిత్ర సంస్కృతి ప్రాముఖ్య వాటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత గురించి చర్చించడం విశిష్టతను సంతరించుకోబోతుంది. ఈ సందర్భంగా హైద్రాబాద్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య బి.జే.రావు, తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య. పిల్లలమర్రి రాములు, పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు పర్వతాలు ను అభినందించారు.



## ఘనంగా ఎస్సీ సెల్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

దేవరకొండ మార్చి 05 వార్త మిర్రర్ :

దేవరకొండ ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ చందంపేట మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తెల్దావర్ పల్లి గ్రామానికి చెందినటువంటి తారి గోవర్ధన్ గారి జన్మదిన వేడుకలను ఎమ్మార్పీఎస్ టీఎస్ దేవరకొండ మండల అధ్యక్షులు కొమ్ము ఉదయ్ కుమార్ గారి ఆధ్వర్యంలో వారి మిత్ర బృందంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తరి గోవర్ధన్ ఉదయ్ కుమార్ గారు మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ పరిధిలో ఎక్కడ ఆపతి వచ్చినా తమవంతుగా పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి తమ సహాయ సహకారాలు పేద ప్రజల సేవలో ఉంటామని తెలిపారు అదేవిధంగా ఇంటర్ విద్యార్థిని విద్యార్థులు అధైర్య పడకుండా నిబద్ధతతో క్రమశిక్షణ జ్ఞానం తోటి ఎగ్జామ్స్ రాసి దేవరకొండ నియోజకవర్గానికి అత్యధిక మార్కులు అధిక శాతం ఉత్తీర్ణత పొందాలని దేవరకొండ ప్రాంతానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాల్సిందిగా వారు కోరినారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర ఆంజనేయులు జుట్టు మహేందర్ చాట్ల ప్రశాంత్ ఈశ్వర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.





## బిసిల్లారా.!ఆలోచించండి.

## బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

### - రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి.. మణికంఠ

కల్వకుర్తి మార్చ్ 5 వార్త మిర్రర్ ప్రతినిధి:– బీసీలంతా ఐక్యంగా ఉంటేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని అప్పుడే వెనకబడిన వర్గాల వారందరికీ సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని బిసి సంక్షేమ సంఘం కార్యదర్శి మణికంఠ అన్నారు.కల్వకుర్తి మండలంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సింహభాగం ఉన్న బీసీలకు అందాల్సిన అభివృద్ధి ఫలాలు అందకుండా చేయాలని అనుకుంటే బిసి ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. బీసీలకు రావలసిన 42 శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని కోరారు.ఈ సమావేశంలో ఓయూ జేఏసీ చైర్మన్ జగన్, ఓయూ జేఏసీ నాయకులు రాజు నేత, కల్వకుర్తి బీసీ నాయకులు నాగేష్, గాజుల రాము, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేత

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 5

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్టు భవనంలో ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో... జిఎంఆర్ వరలక్ష్మి పౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ కోర్సులు అయిన హోమ్ ఎయిడ్ హెల్త్ నర్సింగ్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, టైలరింగ్, బ్యూటిషన్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతి, యువకులకు మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి మండలంలో యువత కోసం నైపుణ్య అభివృద్ధి శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీకి సంబంధించిన సంస్థలు ముందుకు వచ్చి ఎంతోమంది పేద యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యతను పెంచి, ఉద్యోగ అవకాశాలు అందించాలని, ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలని అన్నారు. మండలంలోని గిరిజన గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతీ,యువకులు నైపుణ్య కేంద్రాలు కల్పించే శిక్షణను అందిపుచ్చుకొని అభివృద్ధిని సాధించాలని భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలను ఈ శిక్షణ కేంద్రానికి కల్పిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో.. జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రోగ్రాం అధికారి మొయ్య మహేష్, ప్రతిమ ఫౌండేషన్ మార్కెటింగ్ మేనేజర్ కౌశిక్, ఫౌండేషన్ మేనేజర్ వంగ గీతారెడ్డి, చిన్న జీయర్ ట్రస్ట్ ఇన్చార్జి ఏఎం రాజు రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు రాజారెడ్డి, రఘుపతి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసు తుది తీర్పు 10,న

మిర్యాలగూడ మార్చి 5:-( వార్త మిర్రర్) రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేరుమల్ల ప్రణయ్ హత్య కేసు విచారణ చివరిదశకు చేరుకుంది. ఈ నెల 10 న తుది తీర్పు నల్లగొండ రెండవ అదనపు సెషన్స్ కోర్టు, ఎస్సీ ఎస్టీ కోర్టు ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది.రాష్ట్ర వ్యాప్తంగా మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ హత్యకేసు సంచలనం సృష్టించింది. 2018 సెప్టెంబర్ 14న హత్యకు పెరుమాల ప్రణయ్ గురయ్యాడు.తన కూతురిని కులాంతర వివాహం చేసుకున్నాడనే కక్షతో సుఫారీ గ్యాంగ్ తో ప్రణయ్ ను హత్య చేయించినాడని తిరునగరు మారుతిరావుపై ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి పిర్యాదు మేరకు మారుతిరావుతో సహా మొత్తం ఎనిమిది నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన మిర్యాలగూడ ఓన్ టౌన్ పోలీసులు.కేసు విచారణ నడుస్తుండగానే ఆత్మహత్యకు ఏ1 నిందితుడు మారుతీరావు పాల్పడ్డాడు.తుది తీర్పుపై ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రణయ్ కుటుంబ సభ్యులు.



## మల్లికార్జున స్వామి, రాజరాజేశ్వర స్వామి,ఎల్లమ్మ లకు డా. బోగ శ్రావణి ప్రత్యేక పూజలు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 5

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం అర్పపల్లి గ్రామంలో బుధవారం రోజున శ్రీ మల్లికార్జున స్వామి రాజరాజేశ్వర స్వామి, ఎల్లమ్మ జాతర మరియు పట్నాలు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి ఈ కార్యక్రమంలో దులూరు వంశీ, బద్దల గంగరాజాం, దిటి వెంకటేష్, గొల్లపెల్లి రాము, కంచర్ల స్రవంతి –నరేష్, మైపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గంగన్న, గంగాధర్, మోగిలి, సాంబరి మల్లేశం మరియు గ్రామస్తులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ నూతన జెండా దిమ్మె పూజ కార్యక్రమంలో పాల్గొన్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అందెల శ్రీరాములు

### చేవెళ్ల పార్లమెంట్ వ్యాప్తంగా 100 అధునాతన భారతీయ జనతా పార్టీ జెండాలను ఏర్పాటు చేస్తాం - కొండా విశ్వేశ్వర్ రెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత )..మార్చి : 5

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి మరియు వీరకర్ణ రెడ్డి ఆధ్వర్యంలో నూతన బిజెపి జెండా కొరకు నిర్వహించినటువంటి భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లిచేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ తో కలిసి పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల శ్రమతో చేవెళ్ల పార్లమెంటు వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ అధునాతన జెండాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీకి అనుకూల వాతావరణం నెలకొందని, రానున్న రోజుల్లో తెలంగాణలో మరింత బలంగా భారతీయ జనతా పార్టీ పుంజుకుంటుందని మరియు సంస్థాగతంగా పార్టీని పటిష్టంగా చేసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను గెలుచుకునే దిశగా ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు. అనంతరం బడంగ్ పేట్ లోని శివ సాయి నగర్ కాలనీలో పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను పరిశీలించి స్థానిక కార్పొరేషన్ కమిషనర్ కి ఫోన్ కాల్ చేసి వెంటనే సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఓబిసి మూర్చ రాష్ట్ర నాయకులు నడికుడ యాదగిరి, బిజెపి సీనియర్ నాయకులు సామ సంజీవరెడ్డి, మాజీ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గౌర రమాదేవి శ్రీనివాస్,



గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, బిజెపి సీనియర్ నాయకులు ఏనుగు ప్రభాకర్ రెడ్డి, తర్రే మల్లేష్ యాదవ్, శ్రీశైలం చారి, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వేణు గౌడ్, జక్కడి మధుసూదన్ రెడ్డి, చిత్రం శ్రీనివాస్, రాష్ట్ర ఓబిసి మోర్చా నాయకులు లాల సందీప్, పాలుబాయ్ లక్ష్మణ్, రేసు నరసింహ రెడ్డి, రావుల మల్లేష్, శివరాం రెడ్డి, కుంటి భాస్కర్, నిమ్మల రవికాంత్ గౌడ్, రాంబాబు, దేశపాక జగన్, ఏ శ్రీనివాస్ గౌడ్, మంగాపతి నాయక్, మోతిలాల్ నాయక్, జక్కడి సురేందర్ రెడ్డి, రామిడి మహేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జిల్లా దిశా కమిటీ సభ్యులు అంబోజి శ్రీనివాస్, సామ సుధాకర్ రెడ్డి మహిళా మోర్చా నాయకురాళ్లు నివేదిత, అర్చన, పద్మ, మీనాక్షి, బాలమని, బీజేవైఎం నాయకులు ప్రవీణ్ గౌడ్, క్యారగారి అరవింద్, భరత్ ముదిరాజ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో సామాజిక సేవ దృక్పథం ఉన్న యువతకు అవకాశాలు ఇవ్వాలి.

### టి. ఎస్ .టి వి. వ్యవస్థాపక అధ్యక్షుడు నర్రి స్వామి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 05మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో తెలంగాణ సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మునుగోడు నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లాయర్స్ ఫోరంపర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ కార్యదర్శి హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి కురుమ పాల్గొని మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సామాజిక సేవా దృక్పథం ఉన్న చదువుకున్న యువకులకు అవకాశాలు కల్పించాలని పాలకవర్గాలు మాటలకు మాత్రం సేవా దృక్పథం అలవర్చుకోవాలి యువత రాజకీయాల్లో రాణించాలని చెప్పడం మాత్రమే కాకుండా వారిని ప్రోత్సహించే విధంగా స్థానిక సంస్థల్లో అన్ని పార్టీలు యువతకు సామాజిక సేవా దృక్పథం ఉన్న విద్యావంతులకు అవకాశాలు కల్పించాలని మా తెలంగాణ సామాజిక చైతన్య వేదిక ద్వారా డిమాండ్ చేస్తున్నామన్నారు. పార్టీలు సామాజికవేత్తలను గుర్తించని ఎడల సామాజిక కార్యకర్తలకు మా తెలంగాణ సామాజిక చైతన్య వేదిక నుంచి స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యం వహించడం కోసం కృషి చేస్తామని



తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు మూశం చంద్రశేఖర్ ,దువ్వ నవీన్, జిల్లా నాయకులు కృష్ణ గజేందర్ మునుగోడు నియోజకవర్గ నాయకులు వెంకటేష్ ముదిరాజ్, రవిశంకర్, రవి, కట్టెల గణేష్ రాసమల్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు..

## ఎమర్జెన్సీ లేకుండా అం బులెన్స్ సైరన్ వాడితే చర్యలు....ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నర్సింగ్ రావు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ మార్చి 5 ...నాన్ ఎమర్జెన్సీ లేకుండా సైరస్ వాడితే శాఖ పరమైన చర్యలు ఉంటాయని నల్లకుంట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నర్సింగ్ రావు హెచ్చరించారు. అంబులెన్స్ మిస్ యూస్ స్పెషల్ డ్రైవ్ సందర్భంగా బుధవారం నల్లకుంట ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ నర్సింగ్ రావు తార్నాకలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తార్నాక హుడా కాంపెక్స్ పక్కనే ఉన్న రాజ్యాభిలేఖ కార్యాలయం ఎదుట నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో పలు ఆంబులెన్స్ లను ఇన్స్పెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్స్ పెక్టర్ నర్సింగ్ రావు మాట్లాడుతూ రోగులకు బదులు అంబులెన్స్ ల్లో ఇతర పనులను వినియోగిస్తూ సైరన్ తో ఆంబులెన్స్ వెళ్లితే డ్రైవర్లల పై చర్యలు ఉంటాయని వారిపై కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. అధికంగా డ్రైవర్లు అత్యవసర కేసుల్లో సైరన్లను ఉపయోగించుకోకుండా మిసాయూస్ చేస్తున్న సమాచారం మేరకు ట్రాఫిక్ డిపార్ట్ మెంట్ తనిఖీ చేస్తుందన్నారు చెప్పారు. ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరు పాటించాల్సిందేనన్నారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సి విజయం అల్లీపూర్ లో భాజపా శ్రేణుల సంబరాలు

వార్త మిర్రర్ రాయికల్ ( తిరుమల శంకర్) మార్చి 5ఉమ్మడి కరీంనగర్– ఆదిలాబాద్ – మెదక్ నిజామాబాద్– బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి చిన్న మైల్ భారీ మెజార్టీ విజయం సాధించిన సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ లో బిజెపి నాయకులు టపాసులు పేల్చి మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గొడ్డండ్ల రాజగోపాల్, గొడ్డండ్ల రాజశేఖర్, సిరిపురం ఆనంద్, మిట్టపల్లి రాజేందర్, రచన, తిరుమల దిలీప్, చల్ల నారాయణ గౌడ్, అనుమల్ల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



## జగిత్యాల జిల్లాలో తవ్వకాల్లో ఉపాధి కూలీలకు దొరికిన పురాతన నాణేలు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 5

పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామ సమీపంలోని పెద్దగుట్ట వద్ద బుధవారం ఉపాధి హామీ పనులు చేపడుతున్న కూలీలకు తవ్వకాల్లో పురాతన కాలం నాటి 20 నాణాలు లభించాయి. కూలీలకు నాణేలు దొరకడంతో ఫీల్డ్ అసిస్టెంట్ మంజులకు వారు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమె ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డికి వివరించారు. దీంతో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రవికిరణ్, ఆర్ఐ జమున పంచాయతీ కార్యదర్శి నిఖిల్ రెడ్డి ఉపాధి పనులు చేపడుతున్న ప్రదేశానికి వెళ్లి పురాతన నాణాలను పరిశీలించారు. అనంతరం నాణాలను పురావస్తు శాఖ అధికారులకు అప్పగించిన పోలీస్, రెవెన్యూ అధికారులు..



## ప్రశాంతంగా ఇంటర్ వార్షిక పరీక్షలు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 05

చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఇంటర్ వార్షిక పరీక్షలు తొలి రోజు బుధవారం ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఇంటర్ పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులకు చేతి గడియారాలు, చరవాణీలు, క్యాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అధికారులు లోనికి అనుమతించలేదు.పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మూడు గంటల పాటు పరీక్షలు నిర్వహించారు.తొలిరోజు విద్యార్థులు కాస్త ముందుగానే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల రాకతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి కనిపించింది.పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 144 సెక్షన్ అమలు చేసి పోలీసులు కట్టు దిట్టమైన చర్యలు తీసుకున్నారు.చౌటుప్పల్ లో కేటాయించిన ఐదు పరీక్ష కేంద్రాలలో తొలిరోజు జనరల్, ఒకేషనల్ విభాగంలో 1045 విద్యార్థులకు గాను 990 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 55 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. తొలి రోజు 95% హాజరైనట్టు విద్యాధికారులు తెలిపారు.



## సందుపట్ల మల్లయ్య సగర దశదిన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ సగర సంఘం రాష్ట్ర నాయకులు

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ నగర్)

చింతపల్లి మండలం మాల్ వి. టీ నగర్ బి.జె గార్డెన్స్ లో తెలంగాణ సగర సంఘం నాయకులు సందుపట్ల రాజేష్ సగర, లక్ష్మణ్ సగర, రాము సగర గార్ల తండ్రి సందుపట్ల మల్లయ్య సగర గారి దశదిన కార్యక్రమంలో రాష్ట్ర సగర సంఘం నాయకులు పాల్గొని, సందుపట్ల మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు, అనంతరం సంతు పట్ల వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన, తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర,గౌరవ అధ్యక్షులు ముత్యాల హరికిషన్ సగర, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, జాతీయ సగర సంఘం వైస్ ప్రెసిడెంట్ మందడి ఉదయ్ సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దబుద్దుల సతీష్ సగర, కార్యదర్శి బంగారి ఆంజనేయులు సగర, యువజన అధ్యక్షులు మర్క సురేష్ సగర, ప్రధాన కార్యదర్శి ఉప్పరి మహేందర్ సగర, కోశాధికారి సంధుపట్ల సాయి గణేష్ సగర, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి సగర, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రవి సగర తదితరులు పాల్గొని వారి చిత్ర పటానికి ఘన నివాళులు అర్పించారు.